ఎఎస్‌పిగా నాగేశ్వరి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా నూతన ఎఎస్‌పిగా (అడ్మిన్) ఎల్.నాగేశ్వరి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎఎస్‌పిగా పనిచేసిన డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్ ఎసిబి విభాగానికి విజయవాడ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నాగేశ్వరి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

పిహెచ్‌సిలకు సమస్యల సుస్తీ

- వైద్య సిబ్బంది లేక ఇబ్బంది
- పని ఒత్తిడితో అరకొర వైద్యసేవలు

ప్రజాశక్తి - సీతంపేట

కార్పొరేటర్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని పాలకులు, అధికారులు గొప్పలు చెబుతున్నారు. అయితే ఆచరణంలో మాత్రం సర్కారు దావాఖాల్లో అరకొర వైద్యసేవలే అందుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు సేవలు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందిపై పని భారం పడుతుంది. దీంతో ఉన్న వైద్యాధికారులు, సిబ్బంది ఒత్తిడికి లోనవుతున్నారు. సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ పరిధిలో 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒకటి యుపిహెచ్ ఉన్నాయి. వీటిలో సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే పని బారం పడటంతో కనీసం సెలవు పెట్టి బయటకు వెళ్లలేని పరిస్థితి దాపురించింది. అధికారులు మాత్రం త్వరలోనే పోస్టులను భర్తీ చేస్తామని చెబుతున్నప్పటికీ ఆచరణలో కనిపించడం లేదు.

మండలంలోని ధోనుభాయి, కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏడాదిగా ఒకే ఒక వైద్యాధికారితోనే నెట్టుకొస్తున్నారు. రెండో వైద్య అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఆ పోస్టును ఇంతవరకు భర్తీ చేయలేదు. దీంతో ఉన్న ఒక వైద్యాధికారికి ఇబ్బందులు తప్పడం లేదు. వీరఘట్టం, బాలేరు వైద్యాధికారులు ఉన్నత విద్యాభ్యాసం కోసం ఫిబ్రవరిలో వెళ్లిపోతారు. అప్పుడు అక్కడ కూడా ఒక వైద్యాధికారి మాత్రమే ఉంటారు. మర్రిపాడు పిహెచ్‌సిలో నలుగురు సూపర్వైజర్లకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఫిబ్రవరిలో ఒక సూపర్వైజర్ రిటైర్మెంట్ అయితే ముగ్గురి పని భారం ఒక్కరి మీద పడుతుంది. పాలకొండ గారమ్మ కాలనీ యుపిహెచ్‌సిలో నలుగురు సచివాలయ ఎఎన్ఎం పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఎం.సింగపురంలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు భర్తీ చేయలేదు. బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ లేక వైద్య పరీక్షలకు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఏజెన్సీలో పనిచేసే వైద్యాధికారులకు మరింత ఎక్కువగా పని భారం ఉంటుంది. ఎందుకంటే ఎపిడిమిక్ సీజన్‌లో వ్యాధులతో రోగులు తాకిడి అధికంగా ఉంటుంది. అలాంటి సమయంలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంటే రోగులకు మెరుగైన వైద్యసేవలందే పరిస్థితి ఉండదు. ప్రభుత్వం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులు నియమించినప్పటికీ కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందలేని పరిస్థితి నెలకొంటుంది. ఒక వైద్యాధికారి ఫీల్డ్ విజిట్‌లో గానీ, మెడికల్ క్యాంపులో గాని ఉంటే మరొక వైద్యాధికారి ఫ్యామిలీ ఫిజీషియన్ వాహనం ద్వారా వెళ్లాలి. నెలకు 20 రోజులు ఫ్యామిలీ ఫిజీషియన్ వాహనం ద్వారా వైద్యుల వెళ్లాల్సి ఉంటుంది. ఇక పిహెచ్‌సిలో ఓపి చూడ్డానికి వైద్యులు ఉండడం లేదు. గతంలో 104 వాహనానికి ప్రత్యేకంగా వైద్యాధికారి ఉండేవారు. ప్రస్తుతం వారిని తొలగించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు చేశారు కనుక ప్రతి పిహెచ్‌సికి ముగ్గురు వైద్యాధికారులను నియమిస్తే వైద్య సేవలు సక్రమంగా అందుతాయని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఐటిడిఎ పరిధిలో గల పిహెచ్‌సిల్లోని వైద్యసిబ్బంది ఖాళీలపై ఇప్పటికే కలెక్టర్, ఐటిడిఎ పిఒ దృష్టి తీసుకెళ్లాం. ప్రపతి పాదనలు తయారు చేసి పంపించాం. సిబ్బంది కొరత ఉన్నా గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

- కె.విజయ పార్వతి, డిప్యూటీ డిఎంహెచ్ఒ

చైర్మన్ కుర్చీపై ఉత్కంఠ

రోజురోజుకూ మారుతున్న రాజకీయ సమీకరణాలు

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్మన్ కుర్చీపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చైర్‌పర్సన్ ఎస్సీ కేటగిరికి కేటాయించగా, 20 వార్డులకు గానూ 17 వార్డులు వైసిపికి రాగా, మూడు వార్డు టిడిపికి వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల ముందు నాలుగో వార్డు కౌన్సిలర్ గంగునాయుడు కూటమిలో చేరడంతో 16 మంది కౌన్సిలర్లు వైసిపికి ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో నగర పంచాయతీ చైర్మన్ రాధాకుమారి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేగా, వైసిపికి చెందిన వైస్‌చైర్మన్-2 పల్లా ప్రతాప్‌కు ఆ పదవి వరించింది. ప్రతాప్ వైసిపికి చెందిన నేత అయినప్పటికీ టిడిపికి చెందిన కీలకనేత పల్లా కొండలరావుకు సోదరుడు కావడంతో ఆయనకు ఆ పదవి వరించిందని చెప్పవచ్చు. కొండలరావుకు ఎమ్మెల్యే జయకృష్ణతో ఉన్న సత్‌సంబంధాలతో ప్రతాప్‌కు చైర్మన్ పదవురించిందని చెప్పవచ్చు. అయితే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఎన్నిక జరపాలని ప్రభుత్వ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఇక్కడ ఖాళీగా ఉన్న చైర్మన్ పదవి కూడా ఎన్నిక జరపాలని అధికారులు నిర్ణయించారు. దీంతో ఇక్కడి రాజకీయాలు వేడెక్కాయి. ఎస్సీ కేటగిరికి రిజర్వేషన్ కేటాయించడంతో రెండో వార్డుకు చెందిన ఆకుల మల్లేశ్వరికి అవకాశం దొరుకుతుందని అందరూ భావించగా, రెండు రోజుల క్రితం ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అయితే ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే జయకృష్ణకు మంత్రితో విభేదాలు ఉన్నాయనిది బహిరంగ తెలిసిన విషయమే. ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా మంత్రి ఆకుల మల్లేశ్వరికి, భర్త కుమార్ టిడిపి కండువాలు వేసి కప్పడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇదిఇలా ఉంటే టిడిపి కండువా వేసుకున్న వారికి వైసిపి కౌన్సిలర్లు ఏ విధంగా మద్దతు ఇస్తారని కూడా చర్చ జరుగుతుంది. గురువారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి సమక్షంలో వైసిపి కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఇటీవల టిడిపిలో చేరిన ఆకుల కుమార్ కూడా సమావేశానికి హాజరైనట్లు తెలుస్తుంది. కుమార్‌ను వైసిపిలో ఉండాలని కోరినట్లు సమాచారం. పార్టీ వీడకుండా ఉన్న ప్రస్తుత చైర్మన్ ప్రతాప్ మాత్రం సమావేశానికి పిలవకపోవడం చర్చనీయాంశమైంది. పసుపు కండువా వేసుకున్న ఆకుల కుమార్‌ను పిలవగా, కండువా వేయకుండా ఉన్న ప్రతాప్‌ను పిలవకపోవడంపై రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా మూడో తేదీ నాటికి ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరురూరల్

జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మక్కువ, సాలూరు, పాచిపెంట మండలాల తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేసహాయకులతో రీసర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చే ప్రతి ఫిర్యాదుకు పక్కాగా పరిష్కారం చూపాలన్నారు. వీటిని పూర్తిచేసి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మూడు మండలాల తహశీల్దారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పామాయిల్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పామాయిల్ ప్లాంటేషన్‌తో అధిక ఆదాయం

ప్రజాశక్తి- సీతంపేట

పామాయిల్ ప్లాంటేషన్ ద్వారా గిరిజన రైతులకు అధిక ఆదాయం చేకూరుతుందని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన చిన్నబగ్గ గ్రామంలో పామాయిల్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పామాయిల్ ప్లాంటేషన్‌ను గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీతో ఇస్తున్నట్లు పిఒ తెలిపారు. చిన్నబగ్గకు చెందిన గిరిజన రైతుకు ఎకరాకి 50 మొక్కలు చొప్పున రెండు ఎకరాల్లో 100 మొక్కలను గురువారం నాటారు. అనంతరం చిన్నబగ్గలోని మినీ అంగన్వాడి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అంగన్వాడీలోని చిన్నారులకు అర్ధమయ్యేలా చదువు చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పించాలన్నారు. అనంతరం మర్రిపాడు పిహెచ్‌సిని పరిశీలించి మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పూతికవలస ఆశ్రమ పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్న అదనపు తరగతుల భవన సమస్యను, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. పూతికవలస సబ్ సెంటర్‌ను పరిశీలించి రోగులకు ప్రథమ చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని అక్కడ సిబ్బందికి ఆదేశించారు. అంతకుముందు సీతంపేటలోని పాత పనుకువలస వద్ద ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి అక్కడ పార్క్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఒ వెంకట గణేష్, హెచ్ఒ జయశ్రీ, శాంతి ఆయిల్ పామ్ కంపెనీ మేనేజర్ శ్రీనివాసరావు, తహశీల్దార్ అప్పలరాజు, ఆర్ఐ, ఎపిఐఐసి డిప్యూటీ తహశీల్దార్, మెడికల్ ఆఫీసర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు నిలిపివేత

మూడు పంచాయతీల్లో పనులపై కోర్టు తీర్పు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని మూడు పంచాయతీల్లో ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన సిసి రోడ్లు, కాలువలు, గోశాలల నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. మండలంలోని శివరాంపురం, పెదపదం, పారన్నవరస పంచాయతీల తీర్మానం లేకుండా ఉపాధి పనులు చేయడంపై వైసిపి సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. ఉపాధి హామీ పథక చట్టం నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీల తీర్మానం విధిగా వుండాలనేది స్పష్టంగా ఉంది. అయితే స్థానిక మంత్రి సంధ్యారాణి అండతో ఆ పంచాయతీలకు చెందిన టిడిపి నాయకులు వెండర్ పేరుతో పనులు ప్రారంభించారు. మండలంలో కొన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు చేయడం అధికార, ప్రతిపక్ష పార్టీల స్థానిక నాయకులు అవగాహనతో పని చేసుకుంటున్నారు. ఏదైనా పంచాయతీలో పది పనులు మంజూరైతే వైసిపి సర్పంచులకు కొన్ని పనులు కేటాయిస్తూ అధికారపార్టీ నాయకులు రాజీ కుదుర్చుకున్నారు. కోర్టుకు వెళ్లిన ఈ పంచాయతీల్లో వైసిపి సర్పంచులకు ఉపాధి పనులు ఇవ్వడానికి స్థానిక టిడిపి నాయకులు నిరాకరించారు. దీంతో శివరాంపురం, పెదపదం, పారన్నవరస పంచాయతీలకు చెందిన సర్పంచులు జె.మోహన రావు, రెడ్డి సుకన్య, లక్ష్మణరావు హైకోర్టులో కేసు వేశారు. పంచాయితీ ఆమోదం, తీర్మానం లేకుండా ఉపాధి పనులు చేయడం చట్టవిరుద్ధమని భావిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు మండల అధికారులకు అందాయి. దీనిపై ఎంపిడిఒ జి.పార్వతిని వివరణ కోరగా ఈ మూడు పంచాయతీల్లో ఉపాధి పనులు నిలిపివేయాలని కోర్టు ఉత్తర్వులు అందాయని చెప్పారు. తాజా ఉత్తర్వులు ఆధారంగా చేసుకుని మరి కొంతమంది వైసిపి సర్పంచులు కోర్టును ఆశ్రయించే అవకాశాలు వున్నట్లు తెలుస్తోంది.

ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు పిజిఆర్ఎస్ నిలుపుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో శాసన మండలి సభ్యుల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) నిలిపివేస్తున్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఫిబ్రవరి 27న ఎన్నికల నిర్వహణ, మార్చి 3న ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని, ఎన్నికల ప్రక్రియ మార్చి 8తో ముగుస్తుందన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. దీన్ని ప్రజలు గమనించి వ్యయ ప్రయాసలకు ఓర్చి పిజిఆర్ఎస్ కోసం రావద్దని విజ్ఞప్తి చేశారు.

ఐటిడిఎ వద్ద ధర్నా చేస్తున్న బడిదేవరమ్మకొండ పరిరక్షణ కమిటీ నాయకులు

బడిదేవరకొండ అనుమతులు రద్దు చేయాలి

ఐటిడిఎ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని కోరి రెవెన్యూ పరిధిలో బడిదేవరమ్మ కొండ మైనింగ్ తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అన్ని రకాల అనుమతులు రద్దు చేయాలని కొండ పరిసర ప్రాంత గిరిజనులు, కొండ పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఐటిడిఎ కార్యాలయం అడవితల్లి విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపై గిరిజనులకు పోడు (ఆర్ఒఎఫ్ఆర్) పట్టాలిచ్చిన చోట మైనింగ్ తవ్వకాలకు ఎలా అనుమతి ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండపై మైనింగ్‌కు ఇచ్చిన అన్ని రకాల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ అధికారులు గిరిజనులకు రక్షణగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అక్కడి గిరిజనులు, రైతులు బడిదేవరమ్మ కొండను దేవతగా కొలుస్తారని, ప్రజల మనోభావాలు కూడా పరిగణలోకి తీసుకోకుండా అడ్డగోలుగా తవ్వకాలకు అనుమతులిచ్చి వ్యవసాయం, పర్యావరణం, గిరిజన బతుకులు నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం ధర్నా వద్దకు వచ్చిన ఐటిడిఎ ఎపిఒ మురళీధర్, ఎఒ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బడిదేవర కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎం.కృష్ణ మూర్తి (ఎపి రైతు సంఘం), బొత్స నర్సింగరావు (అఖిల భారత రైతు కూలీ సంఘం), పి.శ్రీను నాయుడు, ఊయక ముత్యాలు, ఎం, భాస్కరావు (బాషా) (రైతు కూలీ సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్), పాలక రంజిత్ కుమార్ (గిరిజన సంక్షేమ సంఘం), పి.సంఘం (అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం) (అయ్యార్ల), బుడితి అప్పల నాయుడు (ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం), టి.జీవ (సిపిఐ), పోలా రమణి (ప్రగతి శీల మహిళా సంఘం), గరుగుబిల్లి సూరయ్య, పాల మెట్ట రాము (వ్యవసాయ కార్మికసంఘం), నారాయణపురం రాజు (అఖిల భారత రైతు కూలీ సంఘం)పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - కురుపాం

తమ పంట పొలాలు ధ్వంసం చేస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్న ఏనుగులను తరలించడంలో అటవీశాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడంలేదని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కురుపాం పంచాయతీ పరిధిలో గల సీతంపేటకు చెందిన గుంట్రెడ్డి రామకృష్ణ ఐదు ఎకరాల కర్బుజా పంటను గురువారం వేకువజామున ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులంతా కురుపాంలో గల అటవీశాఖ కార్యాలయానికి ఏనుగులు ధ్వంసం చేసిన పొలాల ఆస్తి నష్టం వివరాలు తెలియజేయడానికి వస్తే సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడం రైతన్నలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఏనుగుల కదలికలు సమాచారం తెలియజేస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయవలసిన అటవీ శాఖ సిబ్బంది నిర్లక్ష్య వ్యవహరించడమే పంటలతో పాటు ప్రాణాలు కూడా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి కారణం అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యమేనని, పంట నష్టాలు వివరాలు తెలియజేయడానికి వచ్చి గంటల తరబడి ఎదురుచూసినా సిబ్బంది అందుబాటులో లేకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా ఉన్న అధికారులు రైతులను ఏనుగుల కదలికల పట్ల అప్రమత్తం ఎలా చేస్తారో అర్థం కావడం లేదని అన్నారు.

పంటలు నష్టపోయినా, ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా ?

ఏనుగులు ధ్వంసం చేసిన కర్బుజా పంట

తక్షణమే అటవీశాఖ అధికారులు పంట పొలాల వద్దకు వచ్చి రైతుల పంట నష్టాలను అంచనా వేసి నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని, లేనిచో అటవీశాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎప్పటికీ అటవీశాఖ సిబ్బంది అందుబాటలోకి రాకపోవడం అక్కడ నుంచి రైతన్నలు వెనుతిరిగి గుమ్మలక్ష్మీపురం ఎమ్మెల్యే జగదీశ్వరి వద్దకు వెళ్లి వారి పంట నష్టాలు గూర్చి తెలియజేశారు. ఆమె అటవీశాఖ అధికారులతో మాట్లాడి పంట నష్టం అంచనా వేయించి పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారని రైతన్నలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతంపేట గ్రామ రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న తోటలో ఏనుగులు

భామిని : ఘనసర, కీసర మొక్క జొన్న తోటల్లో నాలుగు ఏనుగులు గురువారం సంచరించి పంటను ధ్వంసం చేశాయి. మొక్క జొన్న పొలాలకు నీటిని సరఫరా చేసే పైప్స్, మోటార్‌ను నాశనం చేస్తున్నాయని మొక్క జొన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మొక్క జొన్న పంట ఏపుగా పెరిగి మొక్క జొన్న పొత్తులు చేతికి అందే స్థితిలో ఈ ఏనుగుల పంటను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు పంట నష్టం పరిశీలిస్తున్నారు గాని, వాటికీ రిలొకేషన్ ప్రక్రియలో భాగంగా కొండ ప్రాంతాలకు తరలించడం లేదన్నారు. ఏటా ఈ సీజన్లో ఏనుగులు వచ్చి మొక్క జొన్న పంటని నాశనం చేస్తే రైతు ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి మాటలు కాకుండా, చేతల్లో చర్యలు చూపాలని, పంట నష్ట పోయిన రైతులుని ఆదుకోవాలని కోరుతున్నారు.

దబ్బగెడ్డలో ఆక్రమణలు

- బిసి కాలనీ నిండా ఆక్రమణలు
- ప్రభుత్వ స్థలాలు కబ్జాయే
- పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - మక్కువ

మొన్నటి వరకూ మండలంలోని పోలమాంబ జాతర హడావుడిలో అటు అధికారులు, ఇటు ప్రజలు బిజీబిజీగా ఉండగా, ఇదే సమయం దొరికిందంటూ మండలంలోని దబ్బగెడ్డ బిసికాలనీలో ఆక్రమణల జాతర కొనసాగుతోంది. ఎవరెవరు ఎంతెంత మట్టి పోగులు వేసుకుంటే అంత జాగా ఆక్రమించుకోవచ్చన్న దారిలో ఈ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ ఆక్రమణలకు పాల్పడింది ఇల్లు లేని నిరుపేదలైతే మాత్రం కాదన్నది స్థానికులు వాదన. పక్కా భవనాలున్న వారు, ప్రభుత్వ ఉద్యోగం ఇంట్లో ఉన్నవారు ఆక్రమణలకు పూనుకోవడం అత్యంత ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 30ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇళ్లులేని పేదల కోసం స్థలాలను కొనుగోలు చేసింది. అయితే అప్పట్లో అమ్ముకున్న వారు కూడా ఇక్కడ స్థలాలను ఆక్రమించుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీకి రహదారి కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ ఎవరూ ఇల్లు నిర్మించుకోలేదు. ఈ రహదారి కూడా ఆక్రమణకు గురి కాబోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది జెసిబిలతో చదును చేసేందుకు ఉపక్రమించారు. మరి కొంతమంది వేరొకరి దగ్గర పట్టాలు పొంది భవనాలు నిర్మించుకొనేందుకు సిద్ధమవుతున్నారు.

ఆక్రమించుకున్న స్థలంలో వేసిన మట్టి దిబ్బలు

ఆక్రమణకు గురైన దబ్బగెడ్డ బిసి కాలనీ

ప్రభుత్వ కార్యాలయాల స్థలాలు కూడా...

గతంలో ఇదే సచివాలయం పరిధిలో పలు ప్రభుత్వ కార్యాలయాల కోసం ప్రత్యేకంగా రహదారిని ఆనుకొని స్థలాన్ని కేటాయించారు. ఇప్పటికే సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. అదే వరుసలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, వైద్య సేవా కేంద్రం తదితర భవనాలు నిర్మించాలన్న ఉద్దేశంతో అప్పట్లో కేటాయించిన స్థలాలను కూడా మట్టి పోగులేసుకుని ఆక్రమించుకుంటున్నారు. ఎప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి పట్టాలు ఉన్నవారిని, అలాగే ఇప్పటికే ఇళ్లు, భవనాలు కలిగి ఉన్న వారు, ప్రస్తుతం భవనాలు నిర్మించు కొన్న వారిపై కూడా సమగ్ర విచారణ జరపాలని, ఆక్రమదారులపై కొరడా ఝులిపించాలని స్థానికులు కోరుతున్నారు

సబ్ డివిజన్ లేకపోవడం మరో సమస్య

గతంలో ఇచ్చిన ఇళ్లకు, పట్టాలకు నిర్మించుకున్న వారికి చాలా వ్యత్యాసం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే భవనాలు నిర్మించుకొని, ఖాళీ స్థలాలు కూడా ఆక్రమించుకున్నారనే ఆరోపణ బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు సమగ్ర విచారణ జరిపి ఆక్రమిత స్థలాలను గుర్తించాలని, అలాగే గుర్తింపు పొందిన పేదలకు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులను ఎంపిక చేయాలి

ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ ద్వారా ఇచ్చే జీవనోపాధి పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం జీవనోపాధి పథకాలకు సంబంధించి సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసిడిపి, ఎస్‌సిపి టు టిఎస్‌పి పథకాల కింద మంజూరైన జీవనోపాధి పథకాలకు పూర్తిగా అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని, గతంలో ఎటువంటి జీవనోపాధి పథకాలు పొందకుండా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపిఒ చిన్నబాబు, వెలుగు ఏపిడి సన్యాసిరావు, డిపిఎం రమణ, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపిపి ఆరిసారాయణ, ఎంపిడిఒ కె.గీతాంజలి తెలిపారు. గురువారం వైటిసిలో జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి సమావేశ డేట్ మూడు రోజులు ముందు తెలియజేస్తామని తెలిపారు. దీంతో సర్పంచులు, ఎంపిటిసిలు వెనుదిరిగారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి లక్ష్మీ, సిడిపిఒ రంగలక్ష్మి, వైద్యాధికారి భాను ప్రతాప్, జెఇలు సత్యం, వెంకటేష్, నీలిమ, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

పశు ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రతి పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.అశ్వద్ధామ అన్నారు. మండలంలోని మొండెంఖల్‌లో పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులు కె.శైలజ, అసుమూర్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన పశు వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాడి రైతులకు పశువులు, జీవాలకు సోకే వ్యాధులు, గర్భకోశ వ్యాధులు, చూడి నివారణకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం అవసరమైన వాటికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు జి.విద్యారాణి, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, కూటమి నాయకులు, వెటర్నరీ వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

మెట్లపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఉపాధిహామీ పథక మెట్లపై కక్ష సాధింపు చర్యలు కూటమి ప్రభుత్వం మానుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు వెంకటేష్ బిడ్డయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని దేవుకోన పంచాయతీ అంటివలసలో సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నియమించిన మేట్లుపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తొలగిస్తున్నారన్నారు. పాత మేట్లకు ఇప్పటికే పని డిమాండు ఇవ్వడం, మాస్టరు వేయడంపై శిక్షణ ఇచ్చారని, ఇప్పుడు వీరిని తొలగించి కొత్త వారిని వేయడం వల్ల పని డిమాండు, మాస్టరు వేయడం అన్నింటా ఇబ్బందులేనన్నారు. పాత మేట్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. రామారావు, రామస్వామి, సుబ్బారావు, పాల్గొన్నారు.

కెవికె సేవలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రాన్ని శ్రీకాకుళం నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ కెవికె నుంచి రైతులకు అందిస్తున్న శిక్షణ, సేవలు, ముఖ్య ఉద్దేశాలు, వివిధ డెమో యూనిట్లు, నూతన వంగడాలు, పంటల సాగు పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగుల సంఘ అధ్యక్షులుగా చైతన్య

ప్రజాశక్తి - సీతానగరం

నవ్యాంధ్ర ప్రదేశ్ నిరుద్యోగ సంఘం పార్వతీపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా తోట చైతన్యను నియమిస్తూ ఆ యూనియన్ సంఘాల నుంచి ఆదేశాలు ఆయనకు అందాయి. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులైన సాతులూరి కుమార్‌కు చైతన్య ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గల నిరుద్యోగుల తరఫున ఎప్పుడైనా రాష్ట్ర అధ్యక్షులు ఆదేశాల మేరకు కష్టపడి పని చేస్తానని అన్నారు. అలాగే నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఎపి హెల్త్ ఎడ్యుకేషన్, మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ వారి కేలెండర్, డైరీని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ మేరకు డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలపై వైద్యారోగ్యశాఖ పంపిణీ చేస్తున్న ఐఇసి (పోస్టర్స్, కర పత్రాలు, బ్యానర్లు, ఫ్లిప్ చార్టులు) కళాజాతా ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తం చేయాలని అన్నారు. సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్యం మెరుగునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ పిఎల్ రఘుకుమార్, డాక్టర్ ఎం.వినోద్, డెమో వై. యోగీశ్వరరెడ్డి, సూపరింటెండెంట్ కామేశ్వరరావు, సిసి శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కొమరాడ ప్రాజెక్టు పరిధిలో గల మండలంలోని పెదగుడబ, ఉల్లిభద్ర అంగన్వాడీ కేంద్రాలను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ టి.కనకదుర్గ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అలాగే తనిఖీలో భాగంగా స్టాకులు, ప్రీస్కూలు కార్యక్రమాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే గర్భిణీలకు, బాలింతలకు ప్రభుత్వం మంజూరు చేసిన పౌష్టికాహారం, ప్రీ స్కూల్ పిల్లలు, స్పాట్ ఫీడింగ్‌లను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలోని, అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. ప్రతి పిల్లవానిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్వాడీ హెల్పర్లకు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, ఉల్లిభద్ర, పెద్దగొడబ అంగన్వాడీలు పాల్గొన్నారు.

వివిధ విభాగాల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలో వైసిపి 29 అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఒక్కో విభాగానికి ఒక్కొక్కరిని అధ్యక్షులుగా నియమించామని వీరంతా ప్రజా పోరాటాలకు ముందుకు రావాలని కోరారు.

గాంధీజీ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- సాలూరు

జాతిపిత మహాత్మాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్త గేదెల రామకృష్ణ చెప్పారు. గురువారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన అహింసాయుత పోరాటం భవిష్యత్తులో ఉద్యమాలకు మార్గదర్శకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు, పట్టణ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి విద్య విద్యార్థులు నైపుణ్యం సాధించాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

వృత్తి విద్య విద్యార్థులు నైపుణ్యత సాధించాలని కరాసవలస కెజిబివి ప్రిన్సిపాల్ గాదిపల్లి ప్రశాంతి అన్నారు. గురువారం పిఎన్ బొడ్డవలస డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కెజిబివి విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కరాసవలస కెజిబివి విద్యార్థులకు ఐటి ఐటిఈఎస్ ఒకేషనల్ కోర్సులో భాగంగా 9, 11వ తరగతి విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీ ట్రైనర్ పి.మౌనిక మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి ఇండస్ట్రియల్ విజిట్‌లలో పాల్గొనడం వల్ల వృత్తి విద్య విద్యార్థులు మంచి అవగాహన కలిగి జీవితంలో గొప్ప వృత్తి విద్య నైపుణ్యాన్ని పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ పి.ఆశీర్వాదం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయ్‌చంద్రకు ఘన స్వాగతం

ప్రజాశక్తి- సీతానగరం

దావోస్ పర్యటన ముగించుకొని నియోజకవర్గానికి చేరుకున్న ఎమ్మెల్యే విజయ్ చంద్రకు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పార్వతీపురం పట్టణంతో పాటు పార్వతీపురం బలిజిపేట, సీతానగరం మండలాల నుంచి నాయకులు అభిమానులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు వచ్చి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దావోస్ వెళ్లడం పార్వతీపురం ప్రాంత పేరు అక్కడ ప్రస్తావించే అవకాశం రావడం జీవితంలో మర్చిపోలేని అనుభూతిని అన్నారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగభూషణం, తెంటు అప్పలనాయుడు, రౌతు వేణుగోపాల్ నాయుడు, పెంట సత్యంనాయుడు, కంకణపల్లి అరవింద్, బొమ్ము నాయిని లక్ష్మణరావుతో పాటు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : దావోస్ పర్యటన ముగించుకొని నియోజకవర్గానికి చేరుకున్న ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పార్వతీపురం పట్టణం తో పాటు పార్వతీపురం

పార్వతీపురం: కారులో ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర

బలిజిపేట, సీతానగరం మండలాల నుంచి నాయకులు అభిమానులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. సీతానగరం మండలం నియోజవర్గ ప్రారంభం వద్ద శ్రేణులు ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చి పూలదండలేసి కుంకుమ దిద్ది భారీ ర్యాలీగా జిల్లా కేంద్రానికి తోడ్కొని వచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దావోస్ వెళ్లడం పార్వతీపురం ప్రాంత పేరు అక్కడ ప్రస్తావించే అవకాశం రావడం జీవితంలో మర్చిపోలేని అనుభూతిని అన్నారు. రాష్ట్రం, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం, తను చిత్త శుద్ధితో పనిచేస్తున్నామని మంచి మెరుగైన ఫలితాలు రానున్నాయని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను అధికారపార్టీ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర యథేచ్ఛగా ఉల్లంఘించారు. దావోస్ పర్యటనను ముగించుకుని వస్తున్న సందర్భంగా గురువారు ఆయన సీతానగరం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలతో బైక్, కార్ల ర్యాలీ నిర్వహించారు. బుధవారం సాయంత్రం నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉమ్మడి జిల్లాలో అమల్లోకి వచ్చింది. అధికారపార్టీ ఎమ్మెల్యే కావడంతో దర్జాగా భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలతో జిల్లా కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఈ వ్యవహారంలో ఏవిధమైన చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే మరి.

చెరువులో చేప పిల్లలను వదులుతున్న శ్రీదేవి

చేప పిల్లలు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వివిధ మత్స్యకార గ్రామాల్లో లక్షా 20వేల చేపపిల్లలను చెరువుల్లో విడిచి పెట్టినట్లు ఆ శాఖ అభివృద్ధి అధికారి వై.శ్రీదేవి తెలిపారు. ఈ చేప పిల్లల పంపిణీ ద్వారా మత్స్యశాఖ ద్వారా ఉపాధి పొందిన వారికి ఎంతో లాభం చేపడుతుందన్నారు. కవిరిపల్లి, సరాయివలస, కొండ రేజరు, తూరు తూర్మామిడి గ్రామాల్లోని చెరువుల్లో ఈ చేప పిల్లలను విడుదల చేశారు. గిరిజన మత్స్యకార సహకార సంఘం పరిధిలో కొయ్యన్నపేట, వెంకట బైరిపురంలో చేపపిల్లలను విడిచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ మత్స్య సంఘం అధ్యక్షులు ఎస్.గౌరీశ్వరరావు, టి సత్యనారాయణ పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రహదారి భద్రత నియమాలు పాటించాలని అసిస్టెంట్ మోటర వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాహన దారులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, వాహనాల నడిపే ప్రతి ఒక్కరూ అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి మద్యం సేవించకుండా రహదారి భద్రతా నియమాలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం స్థానిక ఎస్ఐ పి.నారాయణరావుతో కలిసి పూతిక వలస గ్రామం నుంచి గుమ్మ వరకు సందర్శించి ప్రమాదాలు జరగడానికి గల కారణాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ

మండల కేంద్రంలో గురువారం జరిగిన వారపు సంతలో స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతల్లో జరుగుతున్న పరిణామాలు, గ్రామాల్లో, తోటల్లో ఇరుకైన ప్రదేశాల్లో జరిగే నేరాలను డ్రోన్ ద్వారా తెలుసుకోవచ్చునని, సాంకేతిక టెక్నాలజీ రావడం వల్ల రానున్న రోజుల్లో పోలీసు వ్యవస్థకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

సాలూరు: వాహనదారులంతా రహదారి భద్రత పై అవగాహన పెంచుకోవాలని స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జెవి ఎస్ఎస్ఎస్ ప్రసాద్ కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ లు పాల్గొన్నారు.

1/70 చట్టంపై ప్రభుత్వ వైఖరి ఏమిటి? : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఏజెన్సీలో 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో వెంటనే స్పష్టం చేయాలని సిపిఎం రాష్ట్రకమిటీ సభ్యులు రెడ్డి వేణు, జిల్లా కమిటీ సభ్యులు మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని బట్టివలసలో గురువారం గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలు ఏజెన్సీలో అభివృద్ధి చెందాలంటే 1/70 చట్టాన్ని సవరించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఆదివాసీ భూములకు రక్షణ కల్పించే ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈనెల 27న విశాఖపట్నంలో జాతీయ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా జరిగిన సభలో స్పీకర్ చేసిన వ్యాఖ్యలు ఆదివాసీల్లో తీవ్ర ఆందోళన కలిగించేలా ఉన్నాయని తెలిపారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ రాజ్యాంగంలో 5వ షెడ్యూలు కిందకు వస్తుందని తెలిపారు. దీన్ని ధిక్కరించే చట్టాలు, చేసే అధికారం ఏ ప్రభుత్వానికి కూడా లేదని పేర్కొన్నారు. ఇప్పటికే టూరిజం అభివృద్ధి పేరుతో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే అరికట్టాలని కోరారు. భూమిపై గిరిజనులకు హక్కులను ఈ చట్టం మరింత బలోపేతం చేసిందని, మోడీ ప్రభుత్వం ఈ నిబంధనలను సడలించి గిరిజనుల నుండి భూములను బలవంతంగా లాక్కోడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. సాలూరు మండలంలో కురుకూటి పంచాయతీలో అదానీ కంపెనీకి హైడెల్ ప్రాజెక్టు కోసం గిరిజన ప్రాంతాన్ని ధారదత్తం చేయడానికి చూస్తున్నారని, దీన్ని గిరిజనులంతా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. స్పీకర్ ప్రకటనకు వ్యతిరేకంగా మనం పోరాడకపోతే గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70 చట్టం రద్దయ్యే ప్రమాదం ఉందని, దీనికి వ్యతిరేకంగా మన మంతా పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మర్రి మసి, రాజు, వంతల రమేష్, సాంబ, తులసి, గిరిజనులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లోవైద్య సిబ్బంది గురువారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ విధమైన మచ్చలు శరీరంపై ఉన్నా అందుబాటులో ఉన్న ఆసుపత్రులకు వెళ్లి తనిఖీలు చేసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, బి.ప్రదీప్ కుమార్, సూపర్వైజర్లు జనార్దన్ రావు, శాంతకుమారి, ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల రావివలసలో కుష్టి వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, స్పర్శ కార్యక్రమాన్ని

వీరఘట్టం: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గురువారం డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి వీధులో తిరిగి అవగాహన నిర్వహించారు. అలాగే గ్రామానికి ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, ఇఒ ఎస్ఎస్ ప్రకాష్, వై బలరామ నాయుడు, మరియు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. వెన్నుపోటు గ్యారంటీ

మాజీ డిప్యూటీ సిఎం పుష్ప శ్రీవాణి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కూటమి ప్రభుత్వ పాలనలో బాబు ష్యూరిటీ ప్రజలకు వెన్నుపోటు గ్యారెంటీ అని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి విమర్శించారు. జియమ్మవలస మండలం చిన మేరంగి క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో అమలు చేయడం చేతకాక రాష్ట్రం పూర్తిగా అప్పుల పాలైందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో వివిధ సంక్షేమ పథకాల కోసం రూ.3.33లక్షల కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాలంలోనే రూ.1.19 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. ఎనిమిది నెలల కాలంలో ప్రజలకు హామీ ఇచ్చిన ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. సంపద సృష్టిస్తాను, తరువాత పథకాలు అమలు చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా సమయంలో కూడా జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలను ఎంతగానో ఆదుకున్నాయన్నారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా వంటి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. తల్లికి వందనం పథకం అమలు చేయకపోవడంతో చాలామంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అవుతున్నారని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్, 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు 1500, యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఏ ఒక్క హామీ కూడా అమలు జరగలేదన్నారు. సూపర్ సిక్స్‌లో మొదటి సంతకం చేసి ప్రకటించిన డిఎస్‌సి కోసం ఎంతోమంది నిరుద్యోగ యువతీ యువకులు ఎదురు చూస్తున్నారని అయినా నేటి వరకు డిఎస్‌సి ప్రసక్తే లేదని అన్నారు. ప్రజలను వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఏనుగుల సమస్య ప్రజలను పట్టిపీడిస్తోందని కుంకి ఏనుగులను తీసుకువచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నేటి వరకు పరిష్కారం కాలేదన్నారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తన బ్యాంకును సిద్ధం చేసుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రకృతి సేద్యం చేయాలంటే నవధాన్యాలు కలియదున్నిడమే మొదటి మెట్టని దీనివల్ల భూమిలో భూసారంగా పిలవబడే సేంద్రియ కార్బన్ శాతం పెరిగి రసాయన ఎరువుల ఆవశ్యకత, వినియోగం తగ్గుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాంతీయ శిక్షణ మేనేజర్ కె.ప్రకాష్ అన్నారు. ముందుగా కర్రివలస, అమ్మవలసలో అమలవుతున్న ప్రకృతి సేద్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, కేడర్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించినప్పుడే ప్రకృతి సేద్య ఫలితాలు ప్రజలకు అందుతాయని, దీనికోసం కృషి చేయాలని సూచించారు. రికార్డులను తనిఖీ చేశారు. అలసత్వం వహించిన వాళ్లను తొలగిస్తామని తెలిపారు 365 రోజులు నేలను కప్పి ఉంచాలంటే పిఎండిఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) పద్ధతిలో నవధాన్యాలను సాగు చేసుకోవాలని తెలిపారు. రబీ సీజన్లో నవధాన్యాలను సాగు చేసుకుంటే ఖరీఫ్ సీజన్‌కు ఆ విత్తనాలు ఉపయోగపడేలా విత్తన బ్యాంకును రైతులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం పి.కోనవలస రైతు లీలా ప్రసాద్ తన నాలుగు ఎకరాల కొబ్బరి తోటలో 24 రకాల విత్తనాలతో వేసిన పిఎండిఎస్ నవధాన్య సాగును పరిశీలించారు. నవధాన్యాల వల్ల సేంద్రియ కర్బన శాతం భూమిలో పెరుగుతుందని, పలు పంటల వేర్ల వ్యవస్థలు ఉండడం వల్ల పంటకు కావాల్సిన అనేక రకాల పోషకాలు అందుతాయని

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తెలిపారు. జీవ వైవిధ్యం పెరగడం వల్ల మిత్ర పురుగుల సంఖ్య అభివృద్ధి చెందు తుందని, మొండి కలుపుగా భావించే తుంగ గరిక, వయ్యారిభామ వంటి కలుపు అదుపులో ఉంటుందని తెలిపారు. రసాయన ఎరువులు పై ఖర్చు తగ్గుతుందని, ఆరోగ్యవంతమైన పంటల అభివృద్ధి జరుగుతుందని, భూమిలో గాలి, నీరు సమపాలల్లో నిలిచి ఉంటాయని, వర్షాధార భూముల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, భూమి భౌతిక, రసాయన స్వభావం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కావున రైతులంతా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మరియగిరి యాత్రకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు వెంకంపేట సమీపంలో సోమవారం నిర్వహించిన మరియగిరి యాత్ర భక్త జనంతో పోటెత్తింది. ప్రధాన ద్వారం నుంచి దివ్యబలి పూజ వరకు మేరీ మాతను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. శ్రీకాకుళం పిఠాధిపతులు రాయరాల విజయకుమార్ యాత్రికలను ఉద్దేశించి మాట్లాడారు. ఏసుక్రీస్తును నమ్ముకుంటే మీకు శాంతి, సమాధానం, నెమ్మది కలుగుతాయని వివరించారు. యాత్రకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఉండేందుకు పాలకొండ డిఎస్‌పి ఎం రాంబాబు ఆదేశాల మేరకు సిఐ ఎం చంద్రమౌళి పర్యవేక్షణలో కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. కోరికన రవికుమార్ ఫౌండేషన్ సుధీర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు చల్లని పానీ యాలు అందజేశారు. మరియగిరి యాత్రకు కాశీ బుగ్గ, టెక్కలి, సోంపేట, పార్వతీపురం, గరివిడి, గుమ్మలక్ష్మీపురం, సీతానగరం, వీరఘట్టం, తదితర ప్రాంతాల నుంచి సుమారు 100 మంది ఫాదర్లు హాజరయ్యారు. వీరఘట్టం మండలంతో పాటు వివిధ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమం చేపట్టారు. చక్కన సంగీతంతో క్రైస్తవ భక్తి గీతాలను ఆలపించారు. సబ్ డివిజన్ పరిధిలోనే సుమారు 100 మంది పోలీసులతో పాటు వీరఘట్టం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, చిన మేరంగి ఎస్ఐలు కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. మరియగిరి పుణ్యక్షేత్ర అండ్ పాస్టరల్ డైరెక్టర్ అల్లం విజయ రెడ్డి ఆధ్వర్యంలో మరియగిరి పుణ్యక్షేత్ర మహోత్సవ ఘనంగా నిర్వహించారు.

జనసంద్రంగా మారిన మరియగిరి ప్రాంతం

తాగునీటి సమస్య లేకుండా చూడండి

ప్రజాశక్తి- సీతంపేట

పంచాయతీల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని డిపిఒ కొండలరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీతంపేట, భామిని మండలాల కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ముందస్తుగా బోర్ వెల్స్ మెటీరియల్ ట్యాపులు ఉంచుకోవాలన్నారు. మరో నెల రోజుల్లో వేసవి నీటి సమస్య వస్తుందని, దానిని అధిగమించాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూపిసి చెత్త సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి పంచాయతీలకు ఆదాయం తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో డిఎల్‌పిఒ నాగభూషణం, సీతంపేట, భామిని ఎంపిడిఒలు కె.గీతాంజలి, కె.సత్యం కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సపురం గ్రామ శివారులలో ఉన్న షిరిడి సాయి కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు ప్రవేశించి మూడు తులాలు బంగారం చోరీ చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బొంగు రమాదేవి ఇంటికి తాళం వేసుకుని మంగళవారం ఉదయం మక్కువ మండలం శంబరలో జరిగిన పండగకు వెళ్లి బుధవారం రాత్రి తిరిగి వచ్చేసరికి తన ఇంట్లో వెనుక వైపు నుంచి తలుపులు తెరిచి ఉండడం గమనించి పడక గదిలో పరిశీలించగా బీరువా తెరిచి అందులో ఉన్న మూడు తులాల బంగారం చోరీకి గురైందని గుర్తించారు. వెంటనే రూరల్ పోలీసులకు తెలియజేయగా ఎస్ఐ సంతోషి కుమారి తన బృందంతో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు

నేడు ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని మనుమకొండలో వికలాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాలు అందించడానికి హైదరాబాద్ త్రిమ అవయవాలు తయారీ సంస్థ అలికాం ఆధ్వర్యంలో ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సత్యం తెలిపారు. ఈ అవకాశాన్ని వికలాంగులు, వయో వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పిహెచ్‌సిని సందర్శించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో జరుగుతున్న కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాల్లో భాగంగా గురువారం జాతీయ కుష్టు వ్యాధి పరిశీలన బృందం మండలంలోని బందలుప్పి పిహెచ్‌సిని పరిశీలించింది. జిల్లా వైద్యాధికారి భాస్కర్ రావు, చెంగల్పట్టుకు చెందిన జాతీయ కుష్టు వ్యాధి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ వీర కుమరన్, బృంద సభ్యులు డాక్టర్ భాగ్య జ్యోతి, జెడి దేవసాగర్‌లు జిల్లా కేంద్ర ఆసుపత్రితో పాటుగా బందలుప్పి పిహెచ్‌సిను సందర్శించి కుష్టువ్యాధి నిర్ధారణ కార్యక్రమాలు, సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. సిబ్బందికి ఈ విషయంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమల ప్రసాద్, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వే పరిశీలన

ప్రజాశక్తి - కొమరాడ

క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సమస్యలపై సకాలంలో స్పందించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని చంద్రంపేటను గురువారం సందర్శించి ఆరోగ్య సర్వేలు చేపడుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రస్తుతం కొనసాగుతున్న లెప్రసీ, ఎన్సీడి, స్కూల్ హెల్త్, అంగన్వాడీ సర్వే, స్క్రీనింగ్ గ్రామంలో ఏ మేరకు పూర్తి చేసారో గృహసందర్శనలు చేసి పరిశీలించారు. లెప్రసీ అనుమానిత లక్షణాలతో ఎవరినైనా గుర్తించారా అని ఆరా తీశారు. కేన్సర్ చికిత్స పొందుతున్న వ్యక్తి ఆరోగ్యాన్ని పరిశీలించారు. మంచానికే పరిమితమైన వ్యక్తి గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలన చేశారు. గర్భిణీ, బాలింతల గృహ సందర్శన చేసి ఐరన్, కాల్షియం మాత్రలు క్రమంగా వేస్తున్నారా, టిహెచ్ఆర్ పోషకాహారం సద్వినియోగం చేస్తున్నారా అడిగి తెలుసుకొన్నారు. కిల్కారీ మొబైల్ సేవలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల టీకా తేదీలను కార్డులో తనిఖీ చేసి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామస్తులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై తెలుసుకున్నారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం

వృద్ధులతో మాట్లాడుతున్న డిపిఒ జగన్‌మోహనరావు

మెరుగు పడేలా పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. సర్వే పారదర్శకంగా ఉండాలనీ, ఆరోగ్య సమస్యలు, వ్యాధులను గుర్తించి సకాలంలో తగు చికిత్స అందేలా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల సందర్శించి విద్యార్థులతో మాట్లాడి ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు వేయిస్తున్నారా అని అడిగారు. ఈ కార్యక్రమంలో ఎపెడిమిక్ ఇఒ సత్తిబాబు,సూపర్వైజర్ నిర్మల, వైద్య సిబ్బంది ప్రమీల, నరేంద్ర, రమేష్, ఆశ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్వగ్రామమైన ఎం.రాజపురంలో రూ.50 లక్షలతో ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టేందుకు గురువారం ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ పరిశీలించారు. శ్మశాన వాటిక అభివృద్ధి, కాంపౌండ్ వాల్, సిసి రహదారులు, తదితర అభివద్ధి పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, గొర్లెల గౌర్నాయుడు, శంకరాపు భాస్కరరావు, వాన జగన్నాథం, గుమ్మడ సుధాకర్ రావు, పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ